
# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## ఎడిటర్ / డైరెక్టర్
## - టి కృష్ణ

( ***విజయచిత్ర 1974 ఫిబ్రవరి*** నుంచీ పునర్ముద్రణ)

**ఎన్నో చిత్రాలకు** ఎడిటర్‌గా పనిచేసి, మంచి పనితనాన్నీ, నైపుణ్యాన్నీ చూపించి మంచి పేరు తెచ్చుకున్న టి.కృష్ణ దర్శకత్వంలో కూడా ప్రవేశించి, లోగడ 'ఉపాయంలో అపాయం', ప్రస్తుతం 'ఖైదీ బాబాయ్' చిత్రాలను డైరెక్ట్ చెయ్యడానికి వెనక ఎంతో అనుభవం, పరిశ్రమా కనిపిస్తాయి.



వరంగల్ తాలుకాలోని రాయపర్తిలో 1927లో అతను పుట్టినప్పుడు అతని జాతకం ఇంకోలా వుండి వుండేది. కాని, కృష్ణ ఎదుగుతున్న కొద్దీ అతని దృష్టి సినిమాలమీదికీ, సినిమాలు చూడ్డం మీదికీ తిరిగి, జాతకం మారడానికి కారణమైంది. కృష్ణ తండ్రిగారు మంచి పండితులు. ఉభయ భాషలలోనూ ప్రావీణ్యం గలవారు.

'భగవద్గీత'కు వ్యాఖ్యానం చెప్పడంలో ఆయనకు మంచిపేరు. తనలాగా తన కొడుకును కూడా ఉభయ భాషా ప్రవీణుడిని చేసి, పండితుని చెయ్యాలనుకున్నారు ఆయన. కాని, విధి ఇంకో వీధిలోకి తిప్పింది.

అప్పుడే సినిమాలు కొత్తగా వస్తున్నాయి. కృష్ణ సినిమాలు చూడడం ఆరంభించి, ఆ కళమీద ఒక ఆసక్తిని పెంచుకున్నాడు. మేనమామగారి (మాజీ ఆంధ్ర మంత్రి టి. హయగ్రీవాచారి) ప్రోత్సాహంతో కృష్ణ నెమ్మదిగా నాటకాల్లో ప్రవేశించి, నాటకాలు ఆడడం ప్రారంభించాడు. నాటకాల మీద ఉత్సాహం కలగడానికి ఇంకో కారణం అతనికి పాట పాడడం తెలియడం. తాతగారు వీధి భాగవతాలు ఆడేవారు. ఆయన ద్వారా సంగీత కళ, కృష్ణలో కూడా ప్రవేశించింది.

కృష్ణ చదువు బాగానే సాగింది. మెట్రిక్ అయిన తర్వాత, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరి 1948లో బి.ఎ. పూర్తిచేశాడు. ఇంకా చదివించాలన్న కోరిక, అతని పెద్దవాళ్ళకు వున్నా కృష్ణకు మాత్రం చదవాలనిలేదు. 'సినిమాల్లో నటించడానికో, పనిచెయ్యడానికో ఈ చదువు చాలదా?' అనుకున్నాడు.

నైజాం రాష్ట్రంలో లేచిన రజాకార్ల అలజడిలో కృష్ణ పై చదువు విషయం ఆగిపోయింది. ఇంక ఏదైనా ఉద్యోగం చెయ్యాలన్న ఆలోచన పెద్దవాళ్ళకీ, సినిమాల్లో జేరడం ఇప్పటికే ఆలస్యమైపోయింది కాబట్టి, అర్జెంటుగా జేరిపోవాలన్న ఆలోచన కృష్ణకూ వచ్చాయి. ఆ ఆలోచన కార్యరూపం ధరించేలోగా కృష్ణ ఒకటి రెండు ఉద్యోగాలు చేశాడు. 'గోల్కొండ' పత్రికలో సినిమా సమీక్షలు రాయడం. హైద్రాబాదు ఆలిండియా రేడియోలో గ్రామస్తుల కార్యక్రమంలో పాల్గొనడం వంటి అవకాశాలు వచ్చాయి. తెలంగాణా యాసతో 'లింగడు' అనే పాత్రను గ్రామస్తుల కార్యక్రమాలలో కృష్ణ చదివేవాడు. ఆ అనుభవం అతనికి నచ్చింది. అయితే, ఈ విధంగా సినిమాలకు తాను దూరమైపోతానా అన్న భయం లేచి, ఇక లాభం లేదని ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి 1950లో కేవలం సినిమాల్లో చేరాలనే తలంపుతో కృష్ణ మద్రాసులో అడుగుపెట్టాడు.

ఎలాగో అతనికి భరణి రామకృష్ణగారిని చూసే అవకాశం కలిగింది. వీలున్నప్పుడల్లా ఆయన్ని కలుసుకుంటూ తన అభిప్రాయం చెబుతూ వచ్చాడు కృష్ణ. రామకృష్ణగారు హెచ్.యం.రెడ్డిగారిని చూడమని సలహా ఇచ్చారు. కృష్ణ, రెడ్డిగారిని చూసి తన ఉత్సాహం, ఉబలాటం, అనుభవం, నాటకాల్లో వేషాలు, పాటలు పాడడం, రేడియోలో 'లింగడు' పాత్రలన్నీ ఏకరువు పెట్టేశాడు. అంతా విన్నాక రెడ్డిగారు 'సరే పని నేర్చుకో' అని దర్శకత్వశాఖలో కృష్ణని ప్రవేశపెట్టారు. జీతం అదీ ఏమీలేదు. అప్పుడు ఆయన 'నిర్దోషి' చిత్రం మొదలు పెట్టబోతున్నారు. అయితే, కృష్ణకు లోలోపల సినిమాల్లో వేషాలు వెయ్యాలనీ, పాటలు పాడాలనీ కూడా వుండేది. అన్నీ ఒక్కసారే చెప్పేస్తే ఉన్న ఉద్యోగానికి ముప్పు వస్తుందేమోనన్న భయంతో నోరెత్తకుండా వుండేవాడు. అయినా కొన్ని చోట్ల 'కోరస్' పాటల్లో పాడాడు. కొన్ని సినిమాల్లో వేషాలూ వేశాడు.

కృష్ణకు తెలిసిన వ్యక్తులు కొందరు శుభోదయా ఫిలింస్ అన్న పేరిట సినిమా కంపెనీ పెట్టారు. అందులో కృష్ణకు మంచి అవకాశాలు కలిగాయి. వాళ్ళు తీసిన 'ఆదర్శం' చిత్రంలో కృష్ణ ముఖ్యమైన హాస్యపాత్ర ధరించాడు. సావిత్రి అతని

జంట. ఆ చిత్రాన్ని హెచ్.వి.బాబు డైరెక్ట్ చేశారు. కృష్ణ అసోసియేట్‌గా కూడా పని చేశాడు. ఆ చిత్రానికి యం.వి రాజన్ ఎడిటరు. కృష్ణ ఎడిటింగ్‌కు వెళ్తున్నప్పుడల్లా "సినిమా డైరెక్టర్‌కు ఎడిటింగ్ తెలియడం చాలా అవసరం. నీకు ఉత్సాహం వుంటే, ఎడిటింగ్‌లో చేరి, పని నేర్చుకో" అని సలహా ఇచ్చేవారు. ఆయన సలహాతో కృష్ణ ఆయన దగ్గర చేరి 'ఆదర్శం' చిత్రానికి ఎడిటింగ్ శాఖలో కూడా పని చేశాడు. కృష్ణకు 'ఎడిటింగ్' ఉద్యోగం బాగా కనిపించింది. అందులోనే బాగా కృషి చేయాలన్న దీక్ష బయల్దేరింది. యం.వి.రాజన్ దగ్గరే వుండిపోయి, ఎడిటింగ్‌లోనే పని చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. మోడరన్ థియేటర్స్‌వారు తీసిన 'ఆలీబాబా నలభై దొంగలు' చిత్రానికీ, రాజ్‌కపూర్ తీసిన 'ప్రేమలేఖలు', దానికి తమిళ ప్రతి 'అవన్' చిత్రాలకూ రాజనే ఎడిటరు. ఆ చిత్రాలకు కృష్ణ ఎక్కువ బాధ్యతతో పనిచేశాడు. 'ప్రేమలేఖలు" చిత్రానికి పనిచేయడానికి కృష్ణ, రాజన్‌గారితో బొంబాయి కూడా వెళ్ళి, చాలా విషయాలు చూశాడు, తెలుసుకున్నాడు. 'ప్రేమలేఖలు' చిత్రంలో కృష్ణ, ప్రాణ్‌కు 'గొంతు' కూడా ఇచ్చాడు.

కె.యస్.ప్రకాశరావుగారు 'కన్నతల్లి' తీస్తున్న రోజుల్లో ఆదుర్తి సుబ్బారావుగరితో కృష్ణకు పరిచయమైంది. ఆయన తొలిసారిగా 'అమరసందేశం' చిత్రానికి డైరక్టరయినప్పుడు, దర్శకత్వం, ఎడిటింగూ తెలిసిన వ్యక్తిని తీసుకోవాలని, కృష్ణను తీసుకున్నారు. ఆ చిత్రానికి కృష్ణ అసిస్టెంట్ డైరెక్టర్‌గానూ, అసిస్టెంట్ ఎడిటర్‌గానూ పని చేశాడు. 'తోడికోడళ్ళు 'చిత్రానికి అన్నపూర్ణావారు ఆదుర్తిని తీసుకున్నప్పుడు ఆయన ద్వారా కృష్ణకు అన్నపూర్ణా సంస్థలో అసిస్టెంట్ ఎడిటర్ ఉద్యోగం లభ్యమైంది. అప్పట్నుంచీ కృష్ణ విడవకుండా, 21 సంవత్సరాలపాటు ఆదుర్తితోనే వుండి పనిచేశాడు. ఆదుర్తి పనిచేసిన కొన్ని చిత్రాలకు దర్శకత్వ శాఖలో  కూడా పనిచేశాడు.

'కృష్ణప్రేమ' చిత్రానికి, తనకు కృష్ణ మీద వున్న ప్రేమకు చిహ్నంగా అన్నట్టుగా కృష్ణను 'ఎడిటర్'ను చేశారు ఆదుర్తి సుబ్బారావు. ఎడిటర్‌గా కృష్ణ తొలి చిత్రం అది. అప్పట్నుంచీ నేటివరకూ దాదాపు 30 చిత్రాలకు కృష్ణ ఎడిటర్‌గా పనిచేశారు. అయితే ఎక్కువ చిత్రాలు ఆదుర్తి డైరెక్టు చేసిన మంచి మనసులు, మూగమనసులు, డాక్టర్ చక్రవర్తి, దాగుడు మూతలు, తోడూనీడా, పూలరంగడు, తేనెమనసులు, మిలన్, మన్‌కామీత్, డోలీ, మస్తానా, దర్పణ్, జీత్ మొదలైనవి. కృష్ణ ఉర్దూ చదువుకోడంతో హిందీ భాష ఆయనకు బాగా చేరువైంది. ఆయన హిందీ చిత్రాలకు పనిచెయ్యడానికి అది బాగా తోడ్పడింది.

'తోడూనీడా' తర్వాత విజయవర్ధనీ వారు "బొమ్మై" అన్న తమిళ చిత్రం కొని, తెలుగులో ఆదుర్తి చేత తీయించాలనుకున్నారు. అయితే, అప్పట్లో ఆదుర్తికి వ్యవధి లేనందువల్ల ఆ బాధ్యతను కృష్ణకు అప్పచెప్పారు. అలా కృష్ణ దర్శకుడై 'ఉపాయంలో అపాయం' చిత్రాన్ని డైరెక్టు చేశారు.

ఆ మధ్య కృష్ణ బొంబాయిలో వున్నప్పుడు 'ఏక్ ముట్ఠీ ఆస్మాన్' అనే ఉర్దూ నవల చదవడం సంభవించింది. ఆ కథ సినిమాకు బావుంటుందనుకుని, ఆ నవలా రచయిత వీరేంద్రసిన్హాను సంప్రదించారు. అయితే అప్పటికే ఆ కథను అతను ప్రేమ్ జీకి ఇవ్వడం జరిగింది. ప్రేమ్ జీ 'దుష్మన్' పేరిట చిత్రంగా ఆరంభించబోతున్నాడు. ఆ చిత్రం పూర్తికాగానే తెలుగు హక్కులు ఇస్తానని చెప్పడంతో కృష్ణ నిరీక్షించసాగాడు. ఈ నిరీక్షణకు ఇంకో కారణం కూడా వుంది. అతని వరంగల్ మిత్రులు మార్కండేయ, ఆంజనేయులు, హైదరాబాదు మిత్రులు బాబుల్‌నాధ్, లక్ష్మణరావు వీళ్ళంతా కలిసి కృష్ణను పెట్టి మంచి చిత్రం తియ్యాలన్న ఉద్దేశంతో వున్నారు. కథ దొరకగానే ఆ ప్రయత్నం ప్రారంభిద్దామన్నారు కృష్ణ. ఆ అన్వేషణలో ఈ కథ దొరకడం, బాలాజీ చిత్ర పేరుతో సంస్థ ఆరంభమై, కృష్ణ దర్శకత్వంలో 'ఖైదీ బాబాయ్' నిర్మింపబడడం జరిగాయి. ఈస్ట్‌మన్ కలర్ చిత్రం ఈ నెలలో విడుదల కాబోతుంది.

"శ్రీ బాలాజీ చిత్ర నిర్మాతలు కొత్తవారు. అంచేత అన్ని వ్యవహారాలూ నేనే తలమీద వేసుకుని, ఆఫీసు బాయ్ దగ్గర్నుంచి నిర్మాత వరకూ చెయ్యవలసిన పన్లన్నీ నేనే చేశాను. నిజంగా ఇదొక అనుభవం. నా ఇరవైమూడు సంవత్సరాల అనుభవంతో తయారైన చిత్రం ఇది. తారలు, టెక్నీషియన్లూ అందరూ నాతో ఎంతగానో సహకరించారు" అన్నారు కృష్ణ.

"దర్శకత్వ శాఖ నాకు ఇష్టమైన శాఖే అయినా, ఎడిటింగ్‌ను మాత్రం ఎన్నటికీ విడిచి పెట్టను. నాకు ఉత్సాహం వున్న శాఖ ఇది. ఎడిటింగ్ శాఖకు పరిశ్రమలో గుర్తింపు తక్కువగాని, ఇది మహా సముద్రమంతటి శాఖ. నేను రాజన్ గారి దగ్గర ఎడిటింగ్ నేర్చుకున్నా, ఆదుర్తిగారి దగ్గర చాలా చాలా విషయాలు తెలుసుకున్నాను.

చిత్రదర్శకుడికి ఎడిటింగ్‌లో అనుభవం వుంటే చిత్రీకరణను ఆచరణలో పెట్టడం చాలా సుళువు అవుతుంది. తీసినది ఏదీ వృధాకాదు. ఎంతకావాలో అంతే చిత్రీకరించుకోడానికి సావకాశం వుంటుంది. దర్శకత్వం సృజనాత్మకమైనది. దానికి ఎడిటింగ్ పరిజ్ఞానం కూడా తోడయితే, దర్శకత్వం తేలికవుతుంది" అన్నారు కృష్ణ.

"ప్రేక్షకులు హాల్లో కూచుని చిత్రం చూస్తున్నప్పుడు, వాళ్ళకు ఇంకో ఆలోచన రానివ్వకుండా, కథా గమనంతోపాటు వాళ్ళను తీసుకెళ్ళగలిగే చిత్రాన్ని మంచి ఎడిటింగ్‌కు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. చిత్ర నిర్మాణంలో ఎడిటర్ బాధ్యత చాలా పెద్దదీ, గొప్పదీ" అంటారు ఎడిటర్, డైరెక్టర్ టి.కృష్ణ.

Post your comments